ఆర్‌ఎల్డీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డా. కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి

కాచిగూడ: రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్డీ) పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రముఖ పర్యావరణవేత్త డా. కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్‌సింగ్ చౌదరి ఆదేశాలు జారీ చేశారు. రెండు రోజుల రాష్ట్ర పర్యటన సందర్భంగా హైదరాబాద్ విచ్చేసిన కేంద్రమంత్రి జయంత్ సింగ్‌చౌదరి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డాక్టర్ గోపాల్‌రెడ్డి 35 సంవత్సరాలుగా విద్యా, పర్యావరణ రంగాలలో చేసిన కృషిని, ఆయన నిస్వార్థ సేవలను కేంద్ర మంత్రి అభినందించారు.

'కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగింది'

చిక్కడపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. అమెరికాలో జరిగిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో జైసింహ పాల్గొని స్వదేశానికి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం ముషీరాబాద్ బీఆర్‌ఎస్ శ్రేణులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ పార్టీ సీనియర్ నేత పాశం రవి, నాయకులు రాకేష్‌కుమార్, పున్నా సత్యనారాయణ, కుమారస్వామి, రచ్చ నరేష్, కిరణ్‌కుమార్ ఎస్‌టీ ప్రేమ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

విలీన ప్రక్రియపై తేల్చండి

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ కె.రామకృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సెక్రెటేరియట్‌లో చీఫ్ సెక్రెటరీని మర్యాదపూర్వకంగా కలిశారు. జీహెచ్‌ఎంసీలో విలీనాన్ని సాకుగా చూపుతూ రక్షణశాఖ అధికారులు బోర్డు ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.విలీన ప్రక్రియ జాప్యం అయ్యే విధంగా ఉంటే, ఎన్నికల నిర్వహించేలా రక్షణ అధికారులపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ అంశంపై త్వరలోనే స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ చీఫ్ సెక్రెటరీని కోరారు.

చెత్త, మట్టి తొలగింపుపై స్పెషల్ డ్రైవ్



బాగ్‌లింగంపల్లిలో చెత్త, మట్టిని తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో చెత్త, మట్టి తొలగింపు కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు టీఎంసీ రాంమంజులారెడ్డి తెలిపారు. మంగళవారం రాంనగర్ డివిజన్‌లోని బాగ్‌లింగంపల్లి, శ్రీరాంనగర్, మూన్ కేఫ్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో డివిజన్ కార్పొరేటర్ కె. రవిచారితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షకాలంలో ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చెత్త, మట్టి తొలగింపు పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ డా. ప్రవీణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోన్ చోరీ చేసి.. ఫోన్‌పే ద్వారా నగదు కాజేసి..!

కాచిగూడ: తన సెల్‌ఫోన్ దొంగిలించి ఫోన్ పే ద్వారా రూ.41 వేల నగదును కాజేశారని ఓ వ్యక్తి కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్. ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... యూసుఫ్‌గూడకు చెందిన గోవింద్‌రాజు సోమవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. అతడి సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించాడు. ఫోన్‌లోని ఫోన్‌పే ద్వారా రూ.41 వేల నగదును ఆగంతకుడు కాజేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో 11 తులాల బంగారు ఆభరణాలు చోరీ

కాచిగూడ: రైల్లో బంగారు ఆభరణాల చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఆర్‌కే పురం ప్రాంతానికి చెందిన బీఎస్ శర్మ ఈనెల 14వ తేదీన కాచిగూడ నుంచి బెంగుళూర్ వెళ్లుతున్నాడు. అక్కడికి వెళ్లి చూసుకునే సరికి 11 తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్రీఫ్ కేసు కనిపించలేదు. మంగళవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి యశ్వంత్‌పూర్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

యూనివర్సిటీ చిత్రాన్ని ఆదరించండి

ఆర్.నారాయణ మూర్తి

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీ చిత్రాన్ని ఆదరించాలని సినీ దర్శకులు, విప్లవ నటుడు ఆర్.నారాయణమూర్తి విద్యార్థులను కోరారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీకి విచ్చేసిన ఆయన వామపక్ష, దళిత విద్యార్థి సంఘాల నాయకులతో మంగళవారం సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను ఇతివృత్తంగా తీసిన యూనివర్సిటీ చిత్రాన్ని ప్రతి విద్యార్థి చూడాలని, ఇతరులను కూడా చూడాలని చెప్పాలని కోరారు.

బర్కత్‌పుర చమన్ వద్ద రోడ్డుపైనే చెత్తను పడవేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది



కాచిగూడ రైల్వే స్టేషన్ రోడ్డులో..



ఎక్కడి చెత్త అక్కడే..!

- రోడ్లపై పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- దుర్వాసనతో స్థానికులకు ఇబ్బందులు
- స్వైర విహారం చేస్తున్న దోమలు
- పట్టించుకోని పారిశుద్ధ్య విభాగం



గోల్నాక, సుందర్‌నగర్ రోడ్డులో పేరుకుపోయిన చెత్త

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలోని కాచిగూడ, గోల్నాక డివిజన్లలోని ప్రధాన రహదారులు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, బస్తీల్లోని రోడ్లు చెత్తాచెదారంతో పేరుకుపోతున్నాయి. అసలే వర్షాకాలం.. సీజనల్ వ్యాధులతో ఇప్పటికే ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా పారిశుద్ధ్య విభాగం అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన, దోమలు వృద్ధి చెందుతున్నాయని చెబుతున్నారు. కనీసం దోమల నివారణ చర్యలు కూడా చేపట్టడం లేదని వాపోతున్నారు. చెత్తను తొలగించాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తొలగింపజేయాలని స్థానికులు కోరుతున్నారు.



కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి గోల్నాక వెళ్లే రోడ్డులో..



కాచిగూడ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో..



కాచిగూడ రైల్వే స్టేషన్ వెనుక రోడ్డులో...

బకాయిలు తక్షణమే విడుదల చేయాలి



ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర వ్యాప్తంగా బెస్ట్ అవైలబుల్ స్కీమ్ ద్వారా నడుస్తున్న ఎస్సీ, ఎస్టీ, పాఠశాలలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేసి ఆయా పాఠశాలలను పునర్ ప్రారంభించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి టి.నాగరాజు, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు, గిరిజన సంఘం కార్యదర్శి ఆర్. శ్రీరామ్ నాయక్, డీవైఎఫ్‌ఐ అధ్యక్షుడు కోటా రమేష్ మాట్లాడుతూ... దళిత గిరిజన పేద పిల్లలకు ప్రైవేట్ స్కూల్‌లల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రవేశ పెట్టిన బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా వేలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సకాలంలో బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో ఆయా విద్యార్థుల ఇబ్బందులకు గురవుతున్నారని పాఠశాలలు కూడా మూతపడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే పాఠశాలల నిర్వహణకు నిధులు కేటాయించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రజినికాంత్, కిరణ్, అశోక్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపునీటి పైపులైన్ ఏర్పాటు చేయాలి

కాచిగూడ: నింబోలిఅడ్డ మహంకాళి గుడి పరిసర ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై నిలిచిపోయి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోందని... దీంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి తెలిపారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె నింబోలిఅడ్డ ప్రాంతంలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షపునీరు వెళ్లడానికి నూతనంగా పైపులైన్ నిర్మాణపు పనులు చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్, ఏఈ ప్రశాంత్, బీజేపీ నేతలు శ్రీధర్, బాబన్న, నరేష్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నింబోలిఅడ్డలో జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ ఉమారాణి

కచ్చానాలా పనులను త్వరగా పూర్తిచేయాలి



జవహర్ విద్యాలయం చౌరస్తాలో పనులను పరిశీలిస్తున్న అధికారులు, కార్పొరేటర్

చిక్కడపల్లి: కచ్చానాలా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అన్నారు. జవహర్ విద్యాలయం చౌరస్తా వద్ద చేపడుతున్న నిర్మాణ పనులను మంగళవారం జీహెచ్‌ఎంసీ డీఈ గీత, ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌లతో కలసి ఎమె పరిశీలించి మాట్లాడారు. అశోక్‌నగర్ క్రాస్‌రోడ్డు నుంచి వెళ్లే ప్రధాన రోడ్డు కావడంతో నాలా నిర్మాణంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. వర్షకాలం దృష్ట్యా రోడ్డుపై మంచినీరు నిల్వకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, నేతలు రత్న సాయిచంద్, సత్తిరెడ్డి, శ్రీకాంత్, దామోదర్, శివకుమార్, శ్రీనివాస్, నరిసంహ, ఆనంద్‌రావు, సురేష్, మహమూద్, భారత్, ధనరాజ్, నీరజ్, సంయుక్తరాణి తదితరులు పాల్గొన్నారు.

బఫర్ జోన్లలో సీసీ కెమెరాల ఏర్పాటు

అంబర్‌పేట: మూసీ పరీవాహక ప్రాంతాల్లో బఫర్‌జోన్ పరిధిలోకి స్థలాలను రక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ ముకుంద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అంబర్‌పేట తహసీల్దార్ అన్వర్ హుస్సేన్, ఇతర సిబ్బందితో కలిసి మూసీ పరీవాహక ప్రాంతాలను పరిశీలించారు. ఇటీవల మట్టి పోసిన ప్రాంతాలను పరిశీలించారు. బఫర్ జోన్ పరిధిలో ఎలాంటి ఆక్రమణలు చోటు చేసుకోండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు తమ సిబ్బందిని అక్కడ విధుల్లో ఉంచేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన వెల్లడించారు. మట్టిపోస్తే క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు వెనుకాడమన్నారు.



అంబర్‌పేట మూసీ పరీవాహక ప్రాంతలోని బఫర్‌జోన్‌ను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న వెంకట గోవిందరావు తదితరులు

కవాడిగూడ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన సమయంలో గుర్తింపు వస్తుందని తెలిపారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన డాక్టర్ లయన్ వెంకట గోవిందరావు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట గోవిందరావు మాట్లాడుతూ.. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుల మచ్చ విజయకుమార్, ముంజుగల్ల విజయకుమార్, పి.పురుషోత్తంరెడ్డి, నాగరాజు, రాఘవేంద్ర, ప్రవీణ్‌కుమార్, షేక్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

జనగణనలో కులగణనపై కేంద్రం స్పష్టత ఇవ్వాలి

కాచిగూడ: జనగణనలో కుల గణనపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. మంగళవారం కాచిగూడలో ఆయన బీసీ నేతలతో కలిసి మాట్లాడుతూ... జనగణన గెజిట్ నోటిఫికేషన్‌లో కుల గణనపై స్పష్టత లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం ఈనెల 16న సోమవారం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో కులగణనకు సంబంధించిన స్పష్టమైన వివరణ లేకపోవడం బీసీలను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. ఏప్రిల్ 30, 2025న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో జనగణనపై కులగణనను చేర్చాలని నిర్ణయించిందని తెలిపారు. కానీ ఆ నోటిఫికేషన్‌లో ఆ విషయం గురించి స్పష్టత లేదన్నారు. కులగణన అనేది బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో న్యాయమైన ప్రాతినిధ్యం, అవకాశాలను సాధించడానికి కీలకమైన అంశమని పేర్కొన్నారు. గతంలో కేంద్రం ఇచ్చిన హామీలకు విరుద్ధగా ఈ గెజిట్ నోటిఫికేషన్‌లో కుల గణనపై స్పష్టమైన ప్రస్తావన లేదని తెలిపారు. ఈ అంశంపై కేంద్రం తక్షణమే స్పష్టత ఇవ్వాలని కోరారు. బీసీల హక్కులను కాపాడేందుకు రాజ్యాంగబద్ధమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా బీసీ సంఘాలను ఐక్యం చేస్తూ కులగణన అమలు కోసం జాతీయ బీసీ సంక్షేమ సంఘం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.

భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ కార్యదర్శిగా పృథ్వీ

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ కార్యదర్శిగా పృథ్వీ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్ ప్రకటించారు. మంగళవారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకులు ఆర్.విశ్వం, బిజ్జి కనకేష్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీలను అవమానించేందుకే పంచాయతీ ఎన్నికలు

సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి



కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లు ఇవ్వకుండానే ఎన్నికలు నిర్వహించి బీసీలను అవమానించేందుకు చూస్తోందని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. ఎస్. సింహాద్రి అన్నారు. మంగళవారం పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ నిమ్మతోట వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శి కోకటి లక్ష్మణ్ ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల నినాదంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సామాజిక న్యాయానికి విఘాతం కల్పించే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

◆ కాంగ్రెస్ పార్టీ నేతలు, మంత్రుల ప్రకటనలు చూస్తే బీఆర్‌ఎస్, బీజేపీలకు తాము భిన్నంగా లేమని నిరూపిస్తున్నారని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల నుంచి 22 శాతం రిజర్వేషన్లకు తగ్గించి ఇస్తామని చెప్పి 18 శాతం మాత్రమే ఇచ్చిందన్నారు. అదే బాటలో కాంగ్రెస్ పార్టీ నడుస్తోందని ఆరోపించారు.

◆ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేసింది కానీ 22 శాతం బీసీ రిజర్వేషన్లతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోందన్నారు. 42శాతం రిజర్వేషన్లకు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు ద్రోహం చేసిన వాళ్లే అవుతారని ఆయన హెచ్చరించారు. భవిష్యత్‌లో బీసీలు కాంగ్రెస్ పార్టీని నమ్మే స్థితిలో ఉండరని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ స్థాయిలోనే కాంగ్రెస్ పార్టీని బీసీలు భూస్థాపితం చేయనున్నారని ఆయన పేర్కొన్నారు.

◆ బీసీలను ఏడు దశాబ్దాలుగా అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్రంలో అవమానిస్తూ వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి రాజకీయాలు ఇకపై చెల్లవని పేర్కొన్నారు. బీసీల్లో రాజకీయ చైతన్యం వచ్చిందని తెలిపారు. అవమానకరమైన రాజకీయాలు ఎవరూ చేసినా బీసీ సమాజం తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఆలయానికి వాటర్ ట్యాంక్ అందజేత

ముషీరాబాద్: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ2ఏ రీజియన్-4 చైర్మన్ కొత్తూరు జయప్రకాష్‌రావు ఆధ్వర్యంలో 'డాన్ టూ డెస్క్'కార్యక్రమంలో భాగంగా మంగళవారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు గార్లపాటి సతీష్, రీజియన్ చైర్మన్ టి.సుజాతరావు, బాదాం కళా కృష్ణరావు పాల్గొన్నారు. ముషీరాబాద్‌లోని సరస్వతీదేవి ఆలయంలో వేయి లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను అందజేశారు. వాసవీ ఆస్పత్రుల ఆధ్వర్యంలో యోగా, వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని అన్నారు. దీని వల్ల వందలాది మంది లబ్ధి పొందుతున్నారని అన్నారు. మానసిక దివ్యాంగులకు ప్రారంభ దశలోనే గుర్తించే కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమం అనంతరం రైతులకు, సైనికులను సన్మానించారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు అన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీఎస్‌యూ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ గతంలో ఉన్న ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యంగ్ ఇండియా బ్రాండ్ పేరుతో ఆర్భాటం చేస్తూ పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ ఏడాది ప్రభుత్వ విద్యా సంస్థలు, హాస్టల్స్‌లో కనీసం మౌలిక సదుపాయలు కూడా కల్పించలేదన్నారు. యూనివర్సిటీలలో ప్రొఫెసర్లను భర్తీ చేయాలేదని విమర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విద్యార్థులు లేకపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. అధిక సంఖ్యాలో గురుకులాల, సంక్షేమ హాస్టల్స్ , ప్రైవేట్ అద్దె బిల్డింగ్‌లోనే కొనసాగుతున్నాయని విమర్శించారు. కార్పొరేట్ దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కోటా ఆనంద్‌రావు, ఉపాధ్యాక్షులు ఎస్.రాజశేఖర్, పి.శ్రీకాంత్, శ్రీధర్‌యాదవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల నాగరాజు

దేశాన్ని అవినీతి రహితంగా మార్చిన ఘనత మోదీదే



గోల్నాక మార్కెట్ కార్ఖానా లేన్‌లో జరిగిన సంకల్ప సభలో మాట్లాడుతున్న డా. గౌతంరావు

నల్లకుంట: ప్రధాని మోదీ నాయకత్వంలో పదకొండేళ్లలో దేశం అన్నిరంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో బీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం రాత్రి గోల్నాక మార్కెట్ కార్ఖానా లేన్‌లో 'సంకల్ప సభ' నిర్వహించారు. దీనికి హాజరైన గౌతంరావు మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పదేళ్లలో నిర్వీరామ కృషి, అంకిత భావం, పట్టుదల కారణంగా దేశం వికసిత్ భారత్ దిశగా ముందడుగు వేసిందన్నారు.

◆ పదేళ్లలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయట పడటమే అందుకు నిదర్శనమని చెప్పారు. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ నినాదాన్ని ఆచరణలో పెట్టి భారతీయులందరి జీవితాల్లో మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. భారతదేశాన్ని అవినీతి రహితంగా మార్చిన ఘనత మోదీదే అని చెప్పడంలో అతిశయోక్తి లేదని పేర్కొన్నారు. ఈ సభలో కార్పొరేటర్ అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీజేపీ నాయకులు ఎస్. నర్సింగ్రావు, కేజే బాబు, లక్ష్మణ్‌కుమార్, శ్యామ్‌రాజ్, ప్రశాంత్‌కుమార్ జోషి, మహేష్, మధుయాదవ్, జ్యోతి, వరలక్ష్మి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

రజకులు, క్షౌర వృత్తిదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

- ఉచిత విద్యుత్ పథకం పెండింగ్ బిల్లులు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటాం
- సీపీఐ శాసనసభ పక్షనేత, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ కోదండరాం



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కవాడిగూడ: రజకులు, క్షౌ ర వృత్తిదారుల ఉచిత విద్యుత్ పథకం పెండింగ్ బిల్లులు ప్రభుత్వం వెంటనే విడుదల అయ్యేలా... వారు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని సీపీఐ శాసనసభ పక్షనేత, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ కోదండరాం హామీ ఇచ్చారు. ఇందిరాపార్కు వద్ద ధర్నాచౌక్ వద్ద రజక, క్షౌ ర వృత్తిదారులు మంగళవారం మహాధర్నా చేపట్టారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రజక, క్షౌ ర వృత్తిదారులకు జీఓ నం.2 ద్వారా 250 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంతో సుమారు లక్ష 12 వేల 586 మంది లబ్ధిదారులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. గడిచిన ఏడాదిన్నర కాలంగా బిల్లులు విడుదల కాకపోవడంతో రజక, క్షౌ ర వృత్తిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చేతి వృత్తులపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న వారిని వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ, మండల సమావేశాలల్లో ప్రత్యేక చొరవ తీసుకొని రజక, క్షౌ ర వృత్తిదారుల సమస్యలపై చర్చించి వారి న్యాయమైన సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

లాండ్రీ, సెలూన్‌ల ఏర్పాటుకు రూ.10లక్షల ఆర్థిక సహకారం అందించాలి...

◆ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి. ఆశయ్య మాట్లాడుతూ.. రజకులకు రూ.187 కోట్లు, క్షౌ ర వృత్తిదారులకు రూ.43 కోట్ల విద్యుత్ బిల్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. నిధులు విడుదల చేసి తమను విద్యుత్ అధికారులు వేధింపుల నుంచి రక్షించాలని కోరారు. ఎల్వీ రెండో కేటగిరి నుంచి ఎల్వీ నాల్గో కేటగిరికి మార్చి వృత్తిదారులకు యూసర్ చార్జీల భారం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. జీఓ నం. 94 ప్రకారం పట్టణాలలో 141 మోడ్రన్ ధోబీఘాట్లను నిర్మించాలని కోరారు. ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని రూపొందించి నవీన లాండ్రీ షాపులు, సెలూన్‌ల ఏర్పాటుకు రూ.10లక్షల ఆర్థిక సహకారం అందించాలన్నారు.

◆ రజక వృత్తిదారుల సంఘం, క్షౌ ర వృత్తిదారులకు సంఘం రాష్ట్ర కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ దాసోజు శ్రావణకుమార్, మాజీ ఎమ్మెల్సీ జూలకంటి రంగారెడ్డి, విమలక్క, సంఘం నాయకులు నరేష్, మదార్, బాలకృష్ణ, మల్లేష్, గోపాల్, జ్యోతి, ఉపేందర్, ప్రసాద్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010463222